క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి రాక

మనుబోలు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మనుబోలు మండలానికి రానున్నారు. జట్ల కొండూరు పరిధిలో 10 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గోదామును ఉదయం 10 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆక్వా రంగానికి తోడ్పాటు అభినందనీయం

నెల్లూరు రూరల్ : రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తోడ్పాటును అందించడం అభినందనీయమని ష్రింప్ హేచరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాగర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బీఎంఆర్ హేచరీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2005లో కోస్టల్ ఆక్వా కల్చర్ చట్ట ప్రకారం పలు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుండేదన్నారు. దీంతో ఆక్వా కల్చర్ అభివృద్ధి కుంటుపడుతుండేదన్నారు. ప్రస్తుతం లోపాలను సవరిస్తూ చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టడం ఆక్వా కల్చర్ అభివృద్ధి దోహదపడుతుందన్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల, రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు ఈ బిల్లు ప్రవేశపెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. వీరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర మత్స్యశాఖ అధికారుల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అమరా శ్రీధర్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని కొండాయపాళెం ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవంలో అసోసియేషన్ చైర్మన్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆనం రామ్‌కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన జిల్లాల ప్రకారం జరిగే ఈ పోటీలకు 350 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ జూడో అసోసియేషన్ కోశాధికారి కై లాశ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, సీఈఓ కేవీఎస్ బాబు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర కోశాధికారి కిరణ్‌కుమార్, అబ్జర్వర్ ఉమేష్‌కుమార్‌సింగ్, జిల్లా జూడో అసోసియేషన్ కోశాధికారి వేటవెంట శేఖర్, ఉపాధ్యక్షుడు ఎండీ హుస్సేన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం

నెల్లూరు(బృందావనం): ఎనిమిది పదులు నిండి నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధ దంపతులకు దాతలు సాయం అందించి ఆదుకున్నారు. వెంకటాచలం ప్రాంతంలో జీవించే వృద్ధ దంపతులు ఆ ప్రాంతంలో జరుగుతున్న రైల్వే పనుల కారణంగా కొన్నిరోజులుగా నెల్లూరులోని భక్తవత్సలనగర్ రైల్వేగేట్ వద్ద భిక్షాటన చేస్తూ బతుకు వెళ్లదీస్తున్నారు. వారి పరిస్థితిని చూసి చలించిన కళాకారుడు, కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు తన మిత్రులు శివాజీ, బాషాలతో కలిసి వారికి అవసరమైన దుస్తులు, పండ్లు, తినుబండారాలతోపాటు కాస్మోటిక్స్ శనివారం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

ఘన సన్మానం

నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పశువైద్య శస్త్రచికిత్సకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్‌ను నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న పశువైద్య కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయప్రకాష్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు.

వృద్ధాశ్రమాలకు బియ్యం బస్తాల వితరణ

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరు నక్కలకాలనీలో ఉన్న ఆస్థాన వృద్ధుల ఆశ్రమం, పొదలకూరు రోడ్డులోని హరిత వృద్ధాశ్రమానికి శనివారం దాతలు బియ్యం బస్తాలను వితరణగా అందజేశారు. నగరంలోని డైకస్ రోడ్డు ప్రాంతానికి చెందిన యలమందరావు వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి యశోద, కుటుంబసభ్యులు సహకారంతో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బియ్యం బస్తాలను వృద్ధాశ్రమాలకు అందజేశారు. కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షేక్ రసూల్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రాజేశ్వరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సాహం

బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎస్ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ జిల్లాల క్రీడాకారులతో సందడి నెలకొంది. రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. వీటికి నిర్వాహకులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

– బుచ్చిరెడ్డిపాళెం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ



ఏలూరు బాలుర జట్టు



చిత్తూరు బాలికల జట్టు



జ్ఞాపికలు అందుకున్న అతిథులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు

మనుబోలు: మనుబోలు – చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం చేశారు. పుష్పాలంకరణ అనంతరం విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద హోమగుండం వేసి ధునిపూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు. మరో రెండు వారాల్లో ఆరాధనోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను అర్చకులు శ్రీనివాసులు పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

• సెట్నెల్ సీఈఓ నాగరాజకుమారి

వెంకటాచలం: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని సెట్నెల్ సీఈఓ నాగరాజకుమారి అన్నారు. మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఈషా యోగా సెంటర్ ఆధ్వర్యంలో 15వ గ్రామోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వాలీబాల్, త్రోబాల్ పోటీలను సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలను ఆహ్వానించి, క్రీడల్లో పాల్గొనేలా చేయడం శుభపరిణామమన్నారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలిచిన వారికి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాగరాజకుమారి

ఆక్వా రంగ అభివృద్ధే లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం: ఆక్వా రంగ అభివృద్ధే లక్ష్యంగా తమ సంస్థ పని చేస్తోందని సొసైటీ ఆఫ్ ఆక్వా కల్చర్ ప్రొఫెషనల్స్ ప్రెసిడెంట్ కె.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేబాల పంచాయతీ పరిధిలో రొయ్యలు సాగు చేస్తున్న మురళీకృష్ణ అనే రైతు, ఇతరుల గుంతలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విద్యార్థులకు ఆరురోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే ఈ రోజు ఫీల్డ్ విజిట్‌కు వచ్చినట్లు తెలిపారు. తమ సంస్థ 2003 సంవత్సరంలో ఏర్పడిందని, అప్పటి నుంచి పలు ఆక్వా రంగ పరిశ్రమలు, అవి ఎదుర్కొటున్న సమస్యలు, ప్రభుత్వ పరంగా వస్తున్న రాయితీలపై రైతులకు వివరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మనదేశం, బంగ్లాదేశ్ నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



రొయ్యల గుంతను పరిశీలిస్తున్న దృశ్యం

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కొడవలూరు: ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చూడాలని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. స్థానిక నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్త ఓట్లు చేరికలు, తప్పొప్పులు, తొలగింపులు ఉన్నా సరిచేసుకునే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఇందుకోసం మూడు దరఖాస్తులను అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, వల్ఫాపురం నవీన్, నాయకులు చక్కా మనోహర్, బెజవాడ యుగంధర్ సింగ్, కాకి శ్రీనివాసులు, నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, కారెంపూడి సుబ్బరామిరెడ్డి, చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, మాగుంట గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

శాంతి ర్యాలీ విజయవంతానికి పిలుపు

బుచ్చిరెడ్డిపాళెం: మణిపూర్‌లో జరిగిన హింసాకాండకు నిరసనగా ఈనెల 22వ తేదీన తలపెట్టిన శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని క్రైస్తవ సంఘ కాపరులు కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పత్రి జాకబ్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ ప్రార్థనా మందిరంలో శనివారం బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దగదర్తి మండలాల క్రైస్తవ సంఘ కాపరుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి ర్యాలీలో మూడు మండలాలకు చెందిన క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దైవసందేశకులు దేవదానం, జాన్సన్, దానియేలు, రవికుమార్, ఎజ్రా, సుధీర్, జాన్‌పాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాస్టర్లు

అందుబాటులో మినుము, పెసర విత్తనాలు



వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త

పొదలకూరు: స్థానిక చిరుధాన్య పరిశోధన స్థానంలో మినుము, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మినుము తిరుపతి-104, పెసర వరంగల్-42 రకం విత్తనాలు 70 క్వింటాళ్లు తమ వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. పల్లాకు తెగులును ఈ విత్తనాలు ఎదుర్కొంటాయన్నారు. దిగుబడి కూడా బాగా ఉంటుందని, కిలో రూ.130 వంతున అమ్ముతున్నట్లు వెల్లడించారు. కావాల్సిన రైతులు పరిశోధన స్థానం వద్దకు వచ్చి తీసుకోవాల్సిందిగా సూచించారు. మినుము విస్తీర్ణం పొదలకూరు పరిసర ప్రాంతాల్లో తగ్గినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మవార్ల పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలను చేశారు. దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పల్లకి సేవ జరిపారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

రహదారులను తవ్వేస్తున్నారు



తవ్వేసిన రహదారి

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టానుసారం రహదారులను తవ్వేస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నావూరు రహదారిపై కొందరు అడ్డగోలుగా తవ్వేసి పైపులు వేశారు. అయితే గుంతలను పూడ్చకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి పొడవునా మొత్తం ఏడు గ్రామాలున్నాయి. గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో వర్షాలకు పెద్ద గోతులుగా మారుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో వాహనచోదకులు, కొత్తగా ఈ మార్గం గుండా ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అసలే మలుపులు అధికంగా ఉన్న ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపుగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇదే సమస్య ఉన్నట్టు ద్విచక్రవాహన చోదకులు చెబుతున్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉషారాణి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాలమహానాడు మహిళా విభాగం నెల్లూరు నగర అధ్యక్షురాలిగా చినకోట ఉషారాణి నియమితులయ్యారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉషారాణిని ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు కాయల మేరి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణకృపాకర్, నగర అధ్యక్షుడు అశోక్, శైలేంద్రబాబు, శంకరమ్మ, ప్రియాంక, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డే మట్టి మాఫియా డాన్

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మట్టి మాఫియా డాన్‌గా చలామణి అవుతున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య విమర్శించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమిరెడ్డి బినామీ బుజ్జినాయుడు టిప్పర్ వెంకటాచలం సమీపంలో బ్యాంక్ ఉద్యోగిని బలి తీసుకుందన్నారు. అయితే వాస్తవాలు పక్కదారి పట్టించి లేనిపోని మాటలు మాట్లాడుతున్నారన్నారు. మట్టి మాఫియా విషయం మొత్తం సోమిరెడ్డి చుట్టూ తిరుగుతోందన్నారు. కనుపూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించే క్రమంలో టిప్పర్ ప్రమాదం జరిగిన ఘటన వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీనికి తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టి మళ్లీ తీసేయడం వాస్తవం కాదా అన్నారు. రైతుల పొలానికి మట్టి తోలుకోవాలని అనుమతులు తీసుకుని సోమిరెడ్డి మినామీ బుజ్జినాయుడు అక్రమంగా మట్టిని తరలించడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. చిన్న సంఘటనలకే కలెక్టర్, ఎస్పీలను కలిసే సోమిరెడ్డి రోడ్డు ప్రమాదంపై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఆయన అబద్ధాలను సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు భరించలేకపోతున్నారన్నారు. సోమిరెడ్డి వెంటనే స్పందించి వాస్తవాలు వెల్లడించాలన్నారు. బుజ్జినాయుడిని సోమిరెడ్డి కాళ్లు పట్టుకుని నోరు మెదపొద్దని అంటున్నారని తెలిపారు. ఆయన తన బినామీని హైదరాబాద్‌లో దాచిన మాట వాస్తవం కాదా ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన దోపిడీ చాలక ప్రతిపక్షంలో కూడా ప్రజల కళ్లు కప్పి దోపిడీ చేస్తున్నారన్నారు. కనుపూరు చెరువులో అక్రమ గ్రావెల్‌కు సంబంధించి పదివేల ట్రిప్పులు రవాణా చేసినట్లు పోలీస్ విచారణలో వెల్లడైందన్నారు. రెండు లక్షల క్యూబిక్ మీటర్ల కనుపూరు చెరువు మట్టిని అక్రమంగా దోచుకున్నారు. సమస్యను పక్కదారి పట్టించేందుకు సోమిరెడ్డి వేస్తున్న వేషాలు చెల్లవని తెలిపారు. ఆయన ధనదాహానికి చనిపోయిన వారికి న్యాయం జరగాలంటే సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నన్నేకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లి గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి నెల్లూరు క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీకి చెందిన వెంపులూరు రామచంద్రయ్య, వెంపులూరు విజయ్‌కుమార్, పెదమల్లి రంగయ్య, పచ్చూరు నరసింహులు, పచ్చూరు లక్ష్మయ్య వైఎస్సార్‌సీపీలో చేరగా మంత్రి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని కాకాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోసూరు జనార్దన్, అంకోజీ, పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, పోలేరమ్మ ఆయల చైర్మన్ ఎం.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న గాంధీనగర్‌లో శనివారం సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ గాంధీనగర్ ఒకటో వీధిలో రోడ్డు నిర్మాణానికి 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.5 లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పల్లెల్లో నా భూమి – నా దేశం



కొడవలూరు: స్వాతంత్ర్య సమరయోధుడి కుమారులకు సన్మానం



కొడవలూరు: చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొడవలూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో శనివారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ పూండ్ల ఆదిపరెడ్డి కుమారులు పూండ్ల కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్ రెడ్డి, నాయకుడు ఎసకే మాబాషా, మహిళా పోలీసు మేరీ హెప్సిబా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నార్తురాజుపాళెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 'నా భూమి – నా దేశం' అనే అంశంపై శనివారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని యాజమాన్య కమిటి సభ్యులు డాక్టర్ పి.గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడూరులో..

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీలో శనివారం నా భూమి – నాదేశం కార్యక్రమం వేడుకగా జరిగింది. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హమీద్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కావల్ రెడ్డి రంగారెడ్డి, కావల్‌రెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: మాజీ సైనికులకు సన్మానం

రేబాలలో..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల గ్రామంలో శనివారం నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా స్వాతంత్ర్య సమరయోధులను గుర్తుచేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సైనికుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలను నాటారు. అనంతరం గ్రామానికి చెందిన మాజీ సైనికులైన నరహరి, సుబ్రహ్మణ్యంను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు మస్తానయ్య, హరిప్రసాద్ రెడ్డి, నాగసుబ్బారెడ్డి, సుధాకర్, కార్యదర్శి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

నేలతల్లికి వందనం

కోవూరు(విడవలూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలో శనివారం కార్యక్రమాలు నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకున్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరులో..



విడవలూరు మండలంలో..